

స్వామియే శరణం అయ్యప్ప





తిరుపతిలోని కపిలేశ్వరాలయానికి సోమవారం అయ్యప్ప మాల ధరించిన భక్తులు పోటెత్తారు. కపిలతీర్థంలో వీరు స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తీక మాసం చివరి సోమవారంతో అధిక సంఖ్యలో స్థానిక భక్తులూ రావడంతో రద్దీగా మారింది.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కార్తీక వెలుగులు



తిరుపతి కపిలేశ్వరాలయం పక్కన ఉద్యానవనంలో..



శ్రీకాళహస్తిలో ముక్కంటి ఆలయం వద్ద..

కార్తీక మాసం చివరి సోమవారం. దీంతో శివాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో రద్దీగా మారాయి. ఆయా ఆలయాల వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. ఈ కార్తీక దీపాలతో ఆలయాలు వెలుగులీనాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం, కపిలేశ్వరాలయం వద్ద రద్దీకి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

దేవతలారా రారండి

● పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వేడుకగా ధ్వజారోహణం



గజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేస్తున్న అర్చకులు

తిరుచానూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సకల దేవతలు అతిథులుగా వచ్చారు. భక్తులు ఆనందపరవశం కాగా ధ్వజపటం పైకి ఎగిరింది. బ్రహ్మాండనాయకుడి ప్రియదేవికి పద్మావతి బ్రహ్మోత్సవం మొదలైంది. తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేందుకు సోమవారం ఉదయం ధ్వజస్తంభం ఎదుట పూజలు చేశారు. సకలదేవతామూర్తులను పండితులు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6 గంటలకు చక్రాత్తాళ్వార్ ముందుకు సాగగా వెనకే అమ్మవారికి అభిముఖంగా గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి అంకురార్పణ సందర్భంగా యాగశాలలోని కలశాల్లో నింపిన నవధాన్యాలు అంకురించాయి. వీటిని తీసుకొచ్చి ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. 9.30 గంటలకు ధనుర్లగ్నంలో వేడుకగా ధ్వజారోహణం చేశారు. కంకణభట్టారు వేంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ క్రతువు జరిగింది. మాడవీధుల్లో భక్తులందరూ అమ్మవారి వాహనసేవ తిలకించేలా ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జియ్యర్‌స్వాములు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచారులుబాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు పెద్దశేష.. రాత్రి 7 గంటలకు హంస వాహనాలపై అమ్మవారు ఊరేగనున్నారు.



చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

చిన్నశేషుడిపై అమ్మ చిద్విలాసం

తొలిరోజైన సోమవారం రాత్రి 7 గంటలకు అమ్మవారు పరమ వాసుదేవుడు అలంకారంలో చిన్నశేష వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవ ముందు కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. కాగా, మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారికి శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం.. ఆస్థాన మండపంలో సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.



వజ్రకిరీటం, లక్ష్మీహారంతో అమ్మవారి దర్శనం

అమ్మవారి మూలమూర్తికి శుక్రవారం వజ్రకిరీటం, సహస్ర నామాలు కలిగిన బంగారు లక్ష్మీకాసుల హారం, లక్ష్మీనారాయణ కాసుల హారం అలంకరించారు. విశేష పర్వదినాల్లో మాత్రమే అమ్మవారికి వజ్రకిరీటం అలంకరించడం పరిపాటి. ఇక, బ్రహ్మోత్సవాల సమయంలో అమ్మవారి ఉత్సవర్లు అద్దాల మండపంలో కొలువై ఉంటారు.

తిరుచానూరులో తిరుమల లడ్డూలు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తిరుమల శ్రీవారి లడ్డూలను తిరుచానూరు ఆలయంలో అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల కౌంటర్‌లో టికెట్లు తీసుకుని.. బయట కౌంటర్‌లో లడ్డూలు పొందాలని ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి సాయంత్రం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆయనకు పూర్ణకుంభం స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ఆలయాల్లో భక్తుల రాక గణనీయంగా పెరిగిందన్నారు. మంత్రి ఆనంతో పాటు చంద్రగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ తదితరులున్నారు.

'ఐఎస్‌వో' పంచాయతీగా మేనకూరు!



నాయుడుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ(ఐఎస్‌వో) గుర్తింపులో భాగంగా తొలి దశలో మేనకూరు పంచాయతీ ఎంపికైంది. ప్రజలకు అందిస్తున్న పౌరసేవలు, ఫైల్స్ నిర్వహణ, సుపరిపాలన, ఘన వ్యర్థాల నిర్వహణ, పాలనలో పారదర్శకత, ధ్రువపత్రాల జారీ, జవాబుదారీతనం.. ఇలా 32 అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచే పంచాయతీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ కానుంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా 25 పంచాయతీలను గుర్తించగా అందులో మేనకూరు ఉంది. ఈ పంచాయతీకి తగిన వనరులు.. సమీపాన పారిశ్రామిక వాడ ఉండటంతో ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ అయ్యే దశలో ఉంది. పంచాయతీలో 31 సేవలను ప్రజలకు ఎటువంటి జాప్యం లేకుండా, కార్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా సదుపాయాలను సమకూర్చాల్సి ఉంది. కార్యాలయంలో కనిష్ఠంగా 20 సంవత్సరాల నుంచి వివిధ సర్టిఫికెట్లను భద్రపరచడం, వాటిని డిజిటలైజ్ చేయడం, ప్రజలకు మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, బాలింతల పిల్లలకు పాలుఇచ్చే సౌకర్యవంతమైన గది, దివ్యాంగులకు సరైన వసతి వంటివి ఏర్పాటు చేయాలి. సిబ్బందికి అవసరమైన స్టేషనరీ అందుబాటులో ఉండాలి. వీటన్నింటినీ త్వరలో బృందం పరిశీలించి, ఐఎస్‌వో ప్రమాణాల మేరకు గుర్తించి ధ్రువపత్రాల జారీకి సిఫార్సు చేయనుంది.

రాష్ట్రపతి పర్యటనలో అప్రమత్తంగా ఉండండి

రేణిగుంట/తిరుపతి(కలెక్టరేట్)/తిరుమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సాగే రేణిగుంట విమానాశ్రయం, తిరుచానూరు, తిరుమలను ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం వస్తుండటంతో ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. తిరుచానూరులో పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రొటోకాల్ విధులను నిర్వహించాలన్నారు. ఎయిర్‌పోర్టులో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు, విమానాశ్రయ డైరెక్టర్ భూమినాథన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత వీరు తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి భద్రతాపరంగా చేపట్టాల్సిన వివిధ చర్యలపై పద్మావతి అతిథిగృహంలో చర్చించారు. కాగా, రాష్ట్రపతి 20న మధ్యాహ్నం 3.20 గంటలకు రాష్ట్రపతి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని.. తర్వాత తిరుచానూరులో అమ్మవారిని దర్శించుకుని తిరుమల చేరుకుంటారు. 21న ఉదయం 9.30గంటలకు శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు.



తిరుమలలో అధికారులతో చర్చిస్తున్న అదనపు ఈవో

ఉన్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే మార్గం

● ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సభలో వక్తల మనోభావం



అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమున్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే చక్కటి మార్గాన్ని నిర్దేశిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగం- ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంయుక్తంగా మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. 'లైబ్రరీ-2047: డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్' అంశంపై శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర వహించాల్సి ఉందన్నారు. గ్రంథాలయాలున్న ప్రాంతాల్లో మనుషుల్లో అవగాహన, చైతన్యం ఎక్కువగా కనిపిస్తాయని శ్రీలంక యూనివర్సిటీ వీసీ కొలిత్ వీజే శేఖర్ అభిప్రాయపడ్డారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ విజయభాస్కరరావు సూచించారు. మంచి కెరీర్‌తో పాటు మంచి విలువలను పాటించాలంటే మంచి పుస్తకాలను చదవాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల్లో, గ్రామాల్లో, పట్టణాలు, నగరాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమే కాదు, ఆధునిక కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వీసీ ఉమాకంజిలాల్ కోరారు. గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయవలసిన అవసరం ఉందని ఇన్‌ఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ దేవకిమదల్లి చెప్పారు. సకాలంలో, సక్రమంగా గ్రంథాలయాల ద్వారా పౌరులకు సమాచారం అందితేనే ప్రజాస్వామిక.. మానవీయ విలువలు పెంపొందుతాయని అంతర్జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు పేర్కొన్నారు. పాఠకుల ఆదరణకు నోచుకునేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దాలని ఇన్‌ఫ్లిబ్‌నెట్ కేంద్ర ప్రతినిధి సురభి కోరారు. ఐటీతో గ్రంథాలయాలు కొత్త మార్గంలో గమనాన్ని సాగిస్తున్నాయని ఇన్‌ఫ్లిబ్ నెట్ ప్రతినిధి సుదర్శనరావు తెలిపారు. ఈ సదస్సుకు 500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్ చేశారు. దేశంలోనే సీనియర్ లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్ కరిసిద్ధప్పను, ఎస్వీ పాలిటెక్నిక్ లైబ్రేరియన్ నటరాజ నాయుడును సత్కరించారు.

సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం



ఈ సదస్సు సందర్భంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 1.3 లక్షల పుస్తకాలను సేకరించి, భద్రపరిచి, డిజిటలైజేషన్ చేస్తున్న లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పొంద్ర సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో లంకా సూర్యనారాయణను సన్మానించారు. గ్రంథాలయానికి, పుస్తక విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన కృషి రాబోయే తరానికీ స్ఫూర్తిగా నిలుస్తుందని ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సాహిత్యవేత్తలు కోట పురుషోత్తం, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పేర్కొన్నారు.

వచ్చే ఏడాది నా పెళ్లి

● స్పష్టతనిచ్చిన హీరో సాయి దుర్గ తేజ్



మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు, హీరో సాయి దుర్గ తేజ్ తన పెళ్లి గురించి తిరుమలలో స్పష్టతనిచ్చారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయనను ఆలయం ముందు మీడియా, వివాహం ఎప్పుడు చేసుకుంటున్నారని అడగడంతో 'వచ్చే ఏడాదిలో ఉంటుంది' అని చెప్పారు. గత కొద్దిరోజులుగా సాయి దుర్గ తేజ్ పెళ్లిపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కాగా వచ్చే ఏడాది వేసవిలో తన 'సంబరాల ఏటిగట్టు' సినిమా అభిమానుల ముందుకు రానుందని తెలిపారు. ఆయన్ను చూసేందుకు, సెల్ఫీలకోసం అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వేడుకగా వినాయక ఆలయ కుంభాభిషేకం


వినాయకస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కాశిపెంట్ల గ్రామంలో వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో చెరువు మొరవ కాలువ కోతకు గురైనా పట్టించుకోలేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి


పిల్లలతో మాట్లాడుతున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంఈవో బాబ్జీ అన్నారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. ప్రార్థనలు, పద్యాలు చెప్పించాలని సూచించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మెరుగైన విద్యా బోధనపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రోహిణీ కుమారి, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, రమేష్, రెడ్డెమ్మ, శ్రీలక్ష్మి, శ్రీదేవి, శోభారాణి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు : సీఐ


సీఐ సురేష్‌కుమార్

చంద్రగిరి, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నేరమని, ఆ మేరకు ఎవరైనా చేస్తూ దొరికితే కటకటాలు తప్పవని సీఐ సురేష్‌కుమార్ హెచ్చ రించారు. చంద్రగిరి మండలంలో కొంతమంది యువత అల్లరి చేష్టలకు పాల్పడు తున్నారని, మత్తు పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోందని అన్నారు. ఇటువంటి వారు పట్టుబడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుం దన్నారు. తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవోను సన్మానించిన టీడీపీ నేతలు

ఎర్రావారిపాళెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : నూతన ఎంపీడీవో దివాకర్‌ను మండల టీడీపీ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో నాయకుల బృందం ఎంపీడీవోను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యూత్ అధ్యక్షుడు నిరంజన్ రాయల్, తలకోన ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ సోమనాథరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ రఘునాథ, శిరివేలు శివ రామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, రమణా రెడ్డి, చంద్రబాబు, నాగరాజ, సుదాకర్ నాయక్, చలపతి, నాగరాజు, మధు, గోపి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

- ట్రాన్స్‌కో డీఈ రామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈ రామిరెడ్డి

ఎర్రావారిపాళెం, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్య మైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ట్రాన్స్‌కో చిన్నగొట్టిగల్లు డీఈ రామిరెడ్డి అన్నారు. మండలంలోని విద్యుత్ కార్యాలయంలో సోమవారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా, సమస్యల సత్వర పరిష్కారం గురించి మాట్లాడారు. గృహ, వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ చోరీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఈ జ్యోతిప్రసాద్, రెండు మండలాల లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

తలకోనలో కార్తీక దీపోత్సవం

ఎర్రావారిపాలెం, నవంబరు17(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో పక్కనే ఉన్న బాలాలయంలో స్వామి వారికి పూజలు చేస్తున్నారు. కార్తీక దీపారాధన ఆలయం ముందున్న నంది మండపంలో చేపట్టారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

వైభవంగా కార్తీక వన భోజనం


మునిరెడ్డిని సన్మానిస్తున్న కళాకారులు

రామచంద్రాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లె వద్ద తిరుపతి వాసుదేవ భజన మండలి, నగర సంకీర్తన మండలి ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా కార్తీక వన భోజనం జరిగింది. 400 మంది కళాకారులు భజనలు, ఆటపాటలతో సంబరాలు నిర్వహించారు. గోమాతతో పాటు నెల్లిచెట్టుకు పూజలు నిర్వహించారు. వన భోజనాలు చేశారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మునిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థల ఛైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, వాసుదేవ భజనమండలి సభ్యులు వాసుదేవరెడ్డి, నాగేశ్వరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మునిరత్నం ఆచారి, సుభద్ర, జయలక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ

పాకాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రఘునాథం, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావ్, వెలగా వెంకటప్పయ్యల సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్రను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాసిలామణి, అధ్యాపకులు చిట్టి కళావతి, ఆదిశేఖర్ రెడ్డి, గ్రంథాలయాధికారి రవీంద్రబాబు పాల్గొన్నారు.

తల్లీకొడుకులకు సన్మానం


తల్లీకొడుకులను సన్మానిస్తున్న చినబాబు

రామచంద్రాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కమ్మపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తల్లి కొడుకులు ఎస్‌జే కామేశ్వరి, ఎంఎస్ భరద్వాజలను ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు సోమవారం సన్మానించారు. కామేశ్వరి డీఎస్సీ 2008 ఎంపికై స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టారు. భరద్వాజ మెగా డీఎస్సీ 2025లతో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న చినబాబు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సభాపతి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయక్, జయశ్రీ, హిమబిందు, శోభ, రాణి, విజయలలిత తదితరులు పాల్గొన్నారు.

జలకంఠేశ్వరుడికి తిరుమంజనం



రామచంద్రాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామితోపాటు కామాక్షి సమేత కోటిలింగేశ్వస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 5గంటల నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నాభిషేక అలంకారంలో మల్లికార్జునస్వామి



తిరుపతిరూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట రోడ్డు ఎల్ఎస్‌నగర్‌లో వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీకమాస ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నాభిషేక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అన్నప్రసాద వితరణ చేశారు.

నిండని చెరువులతో సాగెలా?

రబీ ప్రశ్నార్థకమంటున్న రైతులు



రామచంద్రాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా సరైన వర్షాలు లేని కారణంగా మండలంలోని 15 చెరువులు నిండలేదు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసినప్పటికీ మండలంలో మాత్రం సరిగా కురవలేదు. ఈ ఏడాది వెదురుకుప్పం మండలం అడవుల నుంచి వచ్చిన వర్షపు నీటితో అనుపల్లి చెరువు, పిల్లారికోన చెరువు నిండి మొరవ పారడంతో రాయల చెరువు సగం మాత్రమే నిండింది. కాలువలు సరిగా లేకపోవడంతో నీరంతా స్వర్ణముఖి నది పాలవుతోంది. ఇక వర్షం కురవకపోతే ఈ రబీ సాగుకు నీరు అందే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

పూడిక తీయించాలి



చెరువుల అభివృద్ధి గురించి కొన్నేళ్లుగా పట్టించు కోలేదు. మొక్కలు పెరిగిపోయాయి. పూడిక కూడా తీయించలేదు. ఈ క్రమంలో వర్షం పడినా నిండే పరి స్థితి లేదు. చెరువులను అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

- మునిశేఖర్‌రెడ్డి, రైతు, గంగిరెడ్డిపల్లి

ముళ్లపొదలు తొలగించండి



మూడు గ్రామాలకు సాగు నీరు అందించే అన్నాసామి చెరువు ముళ్లపొదలతో నిండిపోయింది. చెరువులో పెద్ద యెత్తున పూడిక ఏర్పడుతోంది. ముళ్ల పొదలను తొలగించి, కట్టను పటిష్టపరచాల్సి ఉంది. **- జగన్‌మోహన్, రైతు, రామాపురం**

ప్రారంభానికి నోచని చేపల విక్రయ కేంద్రం


నిర్మాణం పూర్తిచేసుకున్న చేపల విక్రయ కేంద్రం

చంద్రగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద చేపల విక్రయ కేంద్రాన్ని నిర్మించి ఐదేళ్లు పూర్తవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యశాఖ చంద్రగిరిలో చేపల విక్రయ గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పంచాయతీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించి, ఈ గదులను మత్స్యకార సంఘం సభ్యులకు కేటాయించాల్సి ఉంది. నిర్మాణం పూర్తయి ఐదేళ్లకు పైగా అవుతున్నా దాని ప్రారంభం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. తద్వారా పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోడల్ స్కూలు మంజూరు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్ రెడ్డి

భాకరాపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ మండలానికి మోడల్ స్కూలును మంజూరు చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలం నుంచి చాలామంది విద్యార్థులు ఎర్రావారిపాళెం, రొంపిచెర్లలోని మోడల్ స్కూలుకు వెళుతున్నారని, ఇక్కడే స్కూలు ఏర్పాటు చేస్తే వారందరూ స్థానికంగానే చదువుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. జిప్సం అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు తీసుకోవాలని ఏవో ధనలక్ష్మి తెలిపారు. ఈ ఏడాది ఉద్యాన పంటలన్నీ ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేశామన్నారు. 10 లక్షల చేప పిల్లలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు కళ్యాణి డ్యాం వద్ద పొందవచ్చునని మత్స్య శాఖ అధికారి తెలిపారు. భాకరాపేట గ్రామంలో పలు చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని తొలగించాలని వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో గిడ్డయ్య, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చదువుతో పాటు సేవాభావం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఏఆర్‌కే రావు, పక్కన సుబ్బారావు

తిరుపతిరూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రామకృష్ణారావు పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం అడపారెడ్డిపల్లెలో ఎస్వీ వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ ప్రజలకు పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు దానిలో భాగస్వాములు కావాల ని ఆకాంక్షించారు. మండల వ్యవసాయాధికారి ఏవీ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ అధికారిణి డాక్టర్ ఎన్.సబిత, డాక్టర్ సి.నాగమణి, వలంటీర్లు పాల్గొన్నారు.





వాహన సేవలో ఆకట్టుకున్న కళారూపాలు

తిరుచానూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతిదేవీ కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారు చిన్నశేష వాహనంపై భక్తులను కటాక్షించారు. వాహన సేవలో కళారూపాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ కళాకారులు గుస్సాడి, బతుకమ్మ, చెక్కభజనలతో అలరించారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల నుంచి నృత్యం, కత్తినాట్యం, రాజమండ్రి నుంచి నెమలి నృత్యం, అన్నమాచార్య ప్రాజెక్టు నుంచి కోలాటం, కూచిపూడి నృత్యం, హెచ్‌డీపీ నుంచి దీపలక్ష్మి నృత్యం, దాససాహిత్య ప్రాజెక్టు నుంచి విజయవాడకు చెందిన కోలాటం, కర్ణాటక నుంచి పద్మావతి కల్యాణం భరత నాట్యం ఆకట్టుకున్నాయి.

సొంతింటి కలను సాకారం చేసుకుందామిలా..!

పీఎంఏవైజీ-2.0లో రూరల్‌లో 342 మంది నమోదు


పద్మావతిపురంలో సర్వేని తనిఖీ చేస్తున్న పీడీ శ్రీనివాసరావు, పక్కన డీఈఈ శ్రీరాములురెడ్డి

తిరుపతిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంతంగా స్థలముండి ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. వీరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-2.0) పథకం ద్వారా గృహాల మంజూరుకు చర్యలు చేపట్టారు. పట్టణ ప్రాంతంలో ఒక్కో లబ్ధిదారుడికి రూ.2.50లక్షల చొప్పున, గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేయనుంది. గ్రామాల్లో సొంతిల్లు లేనివారిని గుర్తించేందుకు అధికారులు రెండు నెలల కిందట సర్వే చేపట్టారు. ఇందులో ఎక్కువ మంది పేదలకు ఇల్లు లేదని తెలియడంతో మరిన్ని గృహాల మంజూరుకు రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. పాలకుల చొరవతో పీఎంఏవై-2.0 (గ్రామీణ్) కింద గృహ నిర్మాణ అధికారులు మరోమారు ప్రత్యేక సర్వే చేశారు. అర్హులైన కుటుం బాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆర్థిక చేయూతనందించి గృహయోగం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. లబ్ధిదారుల నమోదు గడువు ఈ నెల 5వ తేదీతో ముగిసినా నెలాఖరు వరకు పొడిగించారు.

రూరల్‌లో 342 మంది నమోదు: రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేసి అర్హులను గుర్తించారు. సొంత ఖాళీ స్థలముండి గృహ నిర్మాణానికి ఆసక్తి చూపే వారికి సంబంధించిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్‌ను పీఎంఏవైజీ-2.0 పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. నమోదైన వారికి గృహాల మంజూరు కేంద్రస్థాయిలో పర్యవేక్షణ కమిటీ సమీక్షిస్తుంది. మండలంలో 26 పంచాయతీల్లో ఇప్పటికే 342 మందిని పీఎంఏవై-2.0 (గ్రామీణ్) కింద గుర్తించారు. జనవరి నెలాఖరుకు వీరికి నిధులు మంజూరు చేస్తారని గృహ నిర్మాణ సంస్థ అధికారులు అంటున్నారు.

సొంత స్థలముంటే దరఖాస్తుకు అవకాశం

సొంతస్థలం ఉండి.. ఇంకా నమోదు కాకుంటే వెంటనే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు అందించాలి. కొత్త ఇళ్ల మంజూరుకు ఈ నెలాఖరు వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. సర్వేలో పేర్లున్న ఇళ్లు కావాల్సిన వారు సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించాలి. ఫేసియల్ అటెండెన్స్‌తో లబ్ధిదారుడి వివరాలు నిక్షిప్తం చేస్తారు.

- శ్రీరాములురెడ్డి, డీఈఈ, చంద్రగిరి నియోజకవర్గం

వైభవంగా కార్తీక మాస పూజలు




ముక్కోటిలో లక్ష బిల్వ అలంకరణలో స్వామివారు - విశేషాలంకరణలో ఆనందవల్లిదేవి- గవ్వల అలంకరణలో మల్లేశ్వరస్వామి

చంద్రగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో సోమవారం కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహించారు. తొండవాడ వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో స్వామికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేశారు. బిల్వార్చన చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, దీపారాధన చేశారు. ముక్కోటి ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు. అలాగే చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి, గవ్వల అలంకరణ చేశారు. సాయంత్రం సప్తవర్ణ అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ శైవాంగ పండితులు శివకుమార్‌శర్మ, ఆలయ కమిటీ పాల్గొన్నారు.

చెరువులో పడి జార్ఖండ్ వాసి మృతి


మృతిచెందిన మానిక్ బౌరీ

పాకాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లె సమీపంలో గల లింగనచెరువులో పడి జార్ఖండ్ వాసి మృతిచెందాడు. సీఐ సుదర్శన ప్రసాద్ వివరాల మేరకు.. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుదర్శన ప్రసాద్ అక్కడికి చేరుకున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు జార్ఖండ్ రాష్ట్రం జమ్‌తార కర్మతార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమరిథ్ గ్రామానికి చెందిన మానిక్ బౌరీ(40)గా గుర్తించారు. దామలచెరువు సమీపంలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడని, శనివారం సాయంత్రం కూలి డబ్బులు తీసుకున్న తర్వాత ఆయన కనబడలేదని తోటి కూలీలు తెలిపారు. మద్యం మత్తులో చెరువులో పడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరుపతి ఎస్వీసీఎండీ విద్యార్థులు చేసిన మురళీగానం ఆహూతులను మైమరిపించింది. శ్రీకాంత్ బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన సభికులను తన్మయత్వానికి గురిచేసింది. ఈ కార్యక్రమంలో ఏవో సుదాకర్, సూపర్‌వైజర్ సూర్యతేజ పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

చంద్రగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీ కోట గ్రామంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రూపేష్ ఆధ్వర్యంలో కేరళ గురుస్వాములు ఐతేపల్లె చంద్రా, మోహన్ నేతృత్వంలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి పాలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలగంశెట్టి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తి పాటలతో ఆ ప్రాంతం మార్మోగింది. 200 మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. మునెమ్మ, రూపేష్‌లు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబలం స్వామి వలిగరం చిరంజీవి, పిడిపత్రి నాగరాజు పాల్గొన్నారు.

గంగమ్మ గుడిని తొలగించొద్దు..!

వేదాంతపురం గ్రామస్తుల వినతి

తిరుపతిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ రాందాసుకాలనీలో వెలసిన నడివీధి గంగమ్మ ఆలయాన్ని తొలగించొద్దని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్‌లో అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు చెరుకుల పరందామయాదవ్, శ్యాంబాబు, నవీన్ మాట్లాడుతూ పంచాయతీ స్థలంలో ఏర్పాటుచేసిన నడివీధి గంగమ్మకు 15ఏళ్లుగా జాతర ఉత్సవాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లాయర్స్ లేఔట్‌లోని ప్లాట్లలోకి వెళ్లేందుకు అనేక దారులున్నా అడ్డుగా ఉందన్న కారణాన్ని చూపి కొందరు గుడిని తొలగించాలని పట్టుబడుతుండటం భావ్యం కాదన్నారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆలయాన్ని తొలగించొద్దని కలెక్టర్‌కు లేఖ రాశారు.

అహల్యాబాయి జయంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంజుల కళానిధి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అహల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవాన్ని తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఛైర్మన్ జయరామయ్య నేతృత్వంలో సాయంత్రం గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్లో విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు హాస్టల్‌కు పండ్లు వితరణ చేశారు. అహల్యాబాయి స్మృతి సూచికగా విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారులు శాంబోలు హరినాథ్ విద్యార్థులను అలరించారు. గిరిజన బాలికల సంక్షేమ హాస్టల్ ప్రిన్సిపాల్ లత, టీచర్లు చాందిని, శ్రావణి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లను శిక్షించాలి



మీడియాతో మాట్లాడుతున్న నందకిషోర్, శ్రీనివాసులు

మంగళం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులను లక్ష్యంగా చేసుకుని అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా మోసాలకు తెగబడుతోందని, వెంటనే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సామాజిక కార్యకర్తలు తూపల్లి నందకిషోర్, మారెళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఈ ముఠా టీటీడీ పేరుమీద నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి భక్తుల ఆధార్ కార్డులను సేకరించి జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీటీడీ విశ్రాంతి గృహాల పేరుతోనూ నకిలీ వెబ్ సైట్లను సృష్టిస్తున్నారని తెలిపారు. తక్షణం ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని, మోసపూరిత యూఆర్ఎల్ ఫోన్ నంబర్లు, వెబ్‌సైట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

వైద్య విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి (వైద్యం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సదస్సులో రాణించిన స్విమ్స్ వైద్య విద్యార్థులను డైరెక్టర్ ఆర్వీకుమార్ సోమవారం అభినందించారు. ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ లంగ్ క్యాన్సర్(ఐఎస్ఎస్ఎల్‌సీ) ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో స్థానిక గ్రాండ్ రిడ్జ్ హోటల్లో నిర్వహించిన 16వ వార్షిక నేషనల్ లంగ్ క్యాన్సర్ కాన్ఫరెన్స్ జాతీయ సదస్సులో స్విమ్స్ మెడికల్ అంకాలజీ విభాగానికి చెందిన పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ నితిన్ ఇనగంటి, డాక్టర్ భవతి దుగ్గిని పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. వారు డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలవడంతో అభినందించారు. వైద్యరంగంతోపాటు అన్ని రంగాల్లో స్విమ్స్ ఖ్యాతిని పెంచేలా కృషి చేయాలని సూచించారు.

ఎస్‌కేడీ నగర్‌లో తాగుబోతుల వీరంగం

తిరుపతి (నేర విభాగం), నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఎస్‌కేడీ నగర్ మందుబాబులు, రౌడీలకు అడ్డాగా మారింది. ఆ రోడ్డులో వెళ్లాలంటే మహిళలు, విద్యార్థులు హడలిపోతున్నారు. సోమవారం కొందరు యువకులు నడి రోడ్డుపై మద్యం తాగి దారిలో వెళ్లే మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. 10 రోజుల క్రితం పండ్ల మార్కెట్‌లో కొందరు ఆకతాయిలు వ్యాపారులపై దౌర్జన్యం చేశారు. తిరగబడిన వారిపై దాడులకు పాల్పడ్డారు. ఈ ప్రాంతంలోని ఇద్దరు రౌడీలు కొందరు యువకులను వెంటేసుకుని తిరుగుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వారిపై ఇప్పటికే నాలుగు కేసులు కూడా ఉన్నాయి. సోమవారం జరిగిన ఘటనను ఈస్ట్ సీఐ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా తమ దృష్టికి రాగానే సిబ్బందిని పంపి చర్యలు తీసుకున్నామని సమాధానమిచ్చారు. పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో రౌడీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈఎస్ఐ స్థల ఆక్రమణకు యత్నం


స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రి అధికారులు, సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆస్పత్రి స్థలంలో గేటు నిర్మాణ పనులు చేపడుతుంటే కొందరు ఆ స్థలం తమదంటూ పనులను అడ్డుకున్నారు. అంబులెన్సులు, భారీ వాహనాలు ఆస్పత్రిలోకి సులువుగా వచ్చేందుకు వీలుగా ప్రధాన ముఖద్వారం పక్కన అదనంగా మరో గేటును ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా కొందరు ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఆ స్థలం తమదంటూ వాదనకు దిగారు. అది ఆస్పత్రి స్థలమని రికార్డులు చూపించినా వారు వినిపించుకోలేదు. అనంతరం ఆస్పత్రి అధికారులు, సిబ్బంది కలిసి వాదనకు దిగటంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. 1991లో ఈఎస్ఐ ఆస్పత్రికి 6.45 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, ఈ స్థలంలోనే అదనపు గేటు నిర్మాణాన్ని చేపడుతుంటే ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

మహిళల్లో భక్తిభావం పెంచడమే రాస్ లక్ష్యం


రాస్ సిబ్బందితో కలిసి పూజలు చేస్తున్న వెంకటరత్నం

తిరుపతి (ఆటో నగర్), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సంప్రదాయ విలువలు తెలియ జేయడం, భక్తి భావం పెంపొందించడమే లక్ష్యంగా రాస్ పనిచేస్తోందని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం అన్నారు. స్థానిక బొమ్మగుంట వద్ద శ్రీపద్మావతి ప్రార్థన మహిళా మండలిలో చిన్నగుంట మహిళలతో కార్తీకమాస పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ మాసం మహిళలు ఉపవాసాలు ఉంటూ హరిహరనామస్మరణ చేయడం, ఉసిరి దీపారాధన, దీపారాధనలు చేయడం మంచిదన్నారు. మహిళలకు దుప్పట్లు, చేతి కర్రలు, కంకణాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. డైరెక్టర్ వి.నాగరాజు, సిబ్బంది నాగేశ్వర్, వాణి, కవిత, మంజుల పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంపై దాడి బాధాకరం

తిరుపతి(జీవకోన), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): సత్యసాయి జిల్లా హిందూపురం వైసీపీ కార్యాలయంపై దాడి బాధాకరమని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నాయకులు అజయ్‌కుమార్, నల్లాని బాబు, తలారి రాజేంద్ర, కొటూరు ఆంజనేయులు, మద్దాలి శేఖర్, రమేష్, సురేష్, ఇమ్రాన్, పుల్లయ్య, లవ్లీ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తున్నారు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను సంప్రదించి అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీకి అమ్మేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రైల్వే డ్రైవర్లు, గార్డులపై పనిభారం తగ్గించండి


విశ్రాంతి గది వద్ద నిరసన తెలుపుతున్న మజ్దూర్ యూనియన్ నేతలు

తిరుపతి(సెంట్రల్), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రైల్వే డ్రైవర్లు, గార్డులపై పనిభారం తగ్గించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ తిరుపతి శాఖ కార్యదర్శి రవీంద్ర నాయక్, చైర్మన్ ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు తిరుపతి రైల్వే స్టేషన్‌లోని డ్రైవర్లు, గార్డులు విశ్రాంతి గదుల(లాబీ) వద్ద సోమవారం నిరసన తెలిపారు. వారు మాటాడుతూ ప్రత్యేక రైళ్ల సంఖ్య పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం దానికి తగినట్లు డ్రైవర్లు, గార్డులను నియమించడం లేదన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లోకో పైలెట్లకు, సహాయ లోకో పైలెట్లకు, గార్డులకు వేతనం పెంచాలని కోరారు. వారంలో రెండు రోజులు విధులు నిర్వహించే విధంగా చార్టు వేయాలన్నారు. రన్నింగ్ అలెవన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్‌బాషా, జగదీష్, జె.మురళి, ఐ.నరసింహులు, మార్కొండయ్య పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో ప్రీమెచ్యూర్ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న వైద్యులు

తిరుచానూరు, నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రిలో సోమవారం ప్రీమెచ్యూర్ దినోత్సవం నిర్వహించారు. నియోనాటాలజిస్టు డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రీమెచ్యూర్ బేబీలకు ప్రత్యేక చికిత్స, సమగ్ర వైద్యసంరక్షణ అవసరమన్నారు. ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో దానికి సంబంధించి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. డాక్టర్ లతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రీమెచ్యూర్ శిశువుల్లో శ్వాసకోస సమస్యలు, తక్కువ బరువు, ఉష్ణోగ్ర నియంత్రణ లోపాలు ఉంటాయని, తమ ఎన్‌సీఐయూలో నిరంతర పర్యవేక్షణ, వెంటిలేటరీ సదుపాయం, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ప్రాక్టీసెస్ అందుబాటులో ఉన్నాయన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ప్రీమెచ్యూర్ బేబేల ఆరోగ్య సంరక్షణలో తమ ఆస్పత్రి కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనంత్, నిహారిక, కనిష్క తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'కార్తీక' సందడి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో తిరుపతిలోని ప్రముఖ దేవాలయాల వద్ద భక్తుల సందడి కన్పించింది. ప్రత్యేకంచి కపిల తీర్థంలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అయ్యప్ప మాల భక్తులు కూడా కపిల తీర్థంలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుపతిలోని దేవేంద్ర థియేటర్ సమీపంలో గల శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇలా నగరంలోని వివిధ దేవాలయాల్లో భక్తుల సందడి కన్పించింది.




కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు- పుణ్యస్నానాలు ఆచరిస్తున్న అయ్యప్ప భక్తులు

దొంగ ఓట్లతోనే బిహార్‌లో బీజేపీ విజయం

యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఎన్నికల్లో దొంగ ఓట్లతోనే బీజేపీ విజయం సాధించిందని యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఓట్ చోర్.. గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి సోమవారం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బిహార్, హర్యానా రాష్ట్రాల్లో బీజేపీ మొదటి నుంచి ఓట్ల అవకతవకలకు పాల్పడుతోందన్నారు. దీన్ని ప్రజలు క్షమించరన్నారు. అనంతరం ఓట్ల చోరీపై కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, రవి, కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు

● కుమ్మరుల అభివృద్ధి సంక్షేమ సమితి అధ్యక్షుడు రవికుమార్

మంగళం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసులో వాస్తవాలు బయటకు వస్తాయన్న భయంతో పథకం ప్రకారం టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్ కుమార్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని కుమ్మరుల అభివృద్ధి సంక్షేమ సమితి అధ్యక్షుడు రవికుమార్ ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదన్నారు. సిట్ ముందు వాస్తవాలను వెల్లడించడానికి వస్తున్న ఆయన్ను హతమార్చిన నిందితులను ఇప్పటికీ గుర్తించక పోవడం అనుమానాలు తావిస్తోందన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. ఈ కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమితి నేతలు ధరణి కోట, లక్ష్మయ్య, రూపేష్‌బాబు, వెంకటయ్య, రత్నమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆదర్శవంతంగా మెలగాలి


మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి ప్రవర్తన అలవరచుకుని ఆదర్శవంతంగా మెలగాలని తిరుపతి మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కుళ్లాయప్ప పేర్కొన్నారు. జీవకోనలోని విశ్వం హైస్కూల్లో "భద్రత - భవిష్యత్ రక్షణ" అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుళ్లాయప్ప మాట్లాడుతూ భద్రతాంశాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవశ్యకత గురించి వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రోహిణి, హెడ్ కానిస్టేబుల్ సుశీల, కానిస్టేబుళ్లు స్వప్న, నీరజ భద్రతా సంబంధిత అంశాల గురించి వివరించారు. శక్తి యాప్ ఉపయోగం, అత్యవసర సేవల నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. విశ్వం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ, సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు భద్రతాపరమైన అవగాహన పెంచుకుని సురక్షిత మార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

గిరిజనుల బతుకుల్లో వెలుగు నింపిన పవన్



మీడియాతో మాట్లాడుతున్న మధుబాబు

మంగళం, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): గిరిజన ప్రాంతాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న మహోన్నత వ్యక్తి జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సౌకర్యం లేక ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల వారు ఇబ్బంది పడుతుంటే రూ.46లక్షలు వెచ్చించి 17 కుటుంబాల్లో పవన్ వెలుగులు నింపారని పేర్కొన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు, ఉద్యానం కిడ్నీ బాధితులకు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. కౌలు రైతులు అప్పుల బాధలో ఉంటే సొంత నిధులను వెచ్చించారన్నారు. పేదలను ఏనాడూ పట్టించుకోని మాజీ సీఎం జగన్, వైసీపీ మహిళా నాయకురాలు శ్యామలకు పవన్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. జనసేన 44వ డివిజన్ ఇన్‌ఛార్జి విశ్వనాథ్, సాయి, శివరాం, జశ్వంత్, జగదీష్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మెప్మాలో అవినీతిని అరికట్టండి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 వినతులు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 37 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. న్యూ బాలాజీ కాలనీలో అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, మెప్మాలో అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్లు, కాలువలు వేయాలని తదితర సమస్యలపై వినతులు వచ్చాయని, వాటిని ఆయా శాఖల అధికారులకు పంపామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్ దూది కుమారి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి పాల్గొన్నారు.

ఎస్వీయూ ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నీ విజేత సీకాం



మెన్ క్రికెట్ విజేత జట్టు - ఇన్‌స్టిట్యూషనల్ చాంపియన్‌షిప్ జట్టు

తిరుపతి(క్రీడలు), నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): స్థానిక తారకరామ మైదానంలో నిర్వహించిన ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో సీకాం డిగ్రీ కాలేజీ(తిరుపతి)జట్టు విజేతగా నిలిచింది. తుదిపోరులో సీకాం డిగ్రీ కాలేజీ(కలికిరి)జట్టుపై సీకాం డిగ్రీ కాలేజీ(తిరుపతి) జట్టు విజయకేతనం ఎగురవేసింది. కలికిరి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. అలాగే ఇంటర్ కాలేజీ మెన్‌గేమ్స్ ఇన్‌స్టిట్యూషనల్ చాంపియన్‌షిప్ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల దక్కించుకుంది. విజేతలకు ఎస్వీయూ రెక్టార్ సీహెచ్ అప్పారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ట్రోఫీలు, షీల్డ్, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఈసీ మెంబర్ సురేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





శుక్రవారపుతోటలో

ఫలపుష్ప సోయగం





పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని అమ్మవారి శుక్రారపుతోటలో టీటీడీ ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ధ్వజారోహణం అనంతరం ఈ ప్రదర్శనను ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ప్రారంభించారు. వివిధ పురాణ ఘట్టాలపై ఏర్పాటు చేసి మూర్తులు విశేష ఆకర్షణగా మారాయి. నరకాసురుని సంహరిస్తున్న సత్యభామ, పాలకడలిలోని మహావిష్ణువును కాలితో తన్నుతున్న భృగుమహర్షి, వామన అవతారంలో బలి చక్రవర్తిని పాతాళ లోకానికి పాదంతో తొక్కుతున్న దృశ్యం, తాటకిని సంహరిస్తున్న శ్రీరాముడు, శ్రీపద్మావతి, శ్రీనివాసుల కల్యాణ వైభోగం, అష్టలక్ష్మీవైభవం.. వంటివి సెట్టింగ్స్ వేసి కళ్లముందు సాక్షాత్కరించేలా చేశారు. గజేంద్రమోక్షం సైకత శిల్పం ఏర్పాటు చేశారు. అదే విధంగా కూరగాయల రూపొందించిన దేవతామూర్తుల మండపం ఆకర్షణీయంగా ఉంది. చామంతి, రోజా, పెట్రోనియా, బిగోనియా, సాల్వియా వంటి పూలతో రూపొందించిన ఏనుగు, కలశం, సీతాకోకచిలుక, డాల్ఫిన్‌లు ఆకట్టుకుంటున్నాయి. 25 వేల సీజనల్ ఫ్లవర్స్, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నారు. ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్పప్రదర్శశాలను తీర్చిదిద్దారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేదం వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, వన మూలికల ప్రదర్శన,పుస్తక ప్రదర్శనలను కూడా ఈవో ప్రారంభించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు డాక్టరేట్



మారుతీ ప్రసాద్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్‌ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

తిరుమలలో ప్రముఖుల సందడి

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వీనోద్ కుమార్, ఇన్ఫోసిస్ సంస్థ ఛైర్‌పర్సన్ సుధా నారాయణమూర్తి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజజేంద్రప్రసాద్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పీ చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, జస్టిస్ టీ వినోద్‌కుమార్, సుధా నారాయణమూర్తి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,004
తలనీలాలు సమర్పించినవారు: 23,900



తిరుమలలో 'ప్రేమంటే' హీరో, హీరోయిన్



తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): 'ప్రేమంటే' సినిమా బృందం సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. హీరో ప్రియదర్శి, హీరోయిన్ ఆనంది, ఆ చిత్ర నిర్మాత పుష్కర్ రామ్మోహన్‌రావుతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 21న తమ చిత్రం విడుదల కానున్న సందర్భంగా స్వామిని దర్శించుకుని విజయం ప్రసాదించమని కోరుకున్నామన్నారు.

తిరుమలలో పెజావర మఠాధిపతి



ఉడిపిలోని పెజావర మఠాధిపతి విశ్వేషప్రసన్న తీర్థస్వామిజీ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న మఠాధిపతికి ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అర్చక బృందంతో కలిసి ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తా: చిత్తూరు ఎంపీ



తిరుపతి/తిరుపతి(జీవకోన), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం చిత్తూరులో ఆయన్ను కలిసి సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ని కూడా కలిసి సాధన సమితి నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సాధన సమితి నాయకులు వైయస్ బాబు, బుజ్జి బాబు నాయుడు, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వికేంద్రీకరణతో అభివృద్ధి

● వైజాగ్ సీఐఐ సమ్మిట్ సక్సెస్ వెనుక బాబు, లోకేశ్ కృషి



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తిరుపతి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి, అభివృద్ధి వికేంద్రీకరణకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ కృషిచేస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యేలు సునీల్ (గూడూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. వైజాగ్‌లో జరిగిన సీఐఐ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా గురువారం వీరు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సీఐఐ సదస్సు దేశాన్ని ఆకర్షించిందని, రూ13లక్షల కోట్లు పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలు సీఐఐ సదస్సు అందించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదన్నర లోపే డబుల్ ఇంజిన్ సర్కార్ కావడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవాటిని తరిమికొట్టారని మండిపడ్డారు. నాయకత్వంపై నమ్మకం ఉండడం వలనే పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడమే కాకుండా 21 రోజుల్లో సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నారన్నారు. టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై వైసీపీ నాయకులు దొంగేదొంగ అన్నట్టుగా ఉందన్నారు. వైఎస్ వివేకా, పరిటాల రవి హత్యకేసులో సాక్షులు చనిపోయినట్టుగా పరకామణి చోరీ కేసులో ఆధారాలను వైసీపీ నేతలు చెరపేస్తున్నారని ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.





మంచు తెరలను చీల్చుకుని బయటికి వస్తున్న భానుడు....నీటిలోపలున్న చేపలు పైకి వచ్చి సలసలమని పరిగెడుతున్న ధ్వనులు... ఆ చేపలను పట్టుకోవడానికి కొంగల ప్రయత్నాలు.... చిత్తూరు గంగినేని చెరువు కట్టపై సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న వారికి ఆహ్లాదాన్ని మిగిల్చిన దృశ్యాలివి.

దీర్ఘకాలిక విద్యుత్తు సమస్యలను నా దృష్టికి తీసుకురండి

● 'డయల్ యువర్ సీఎండీ'లో వినియోగదారులకు శివశంకర్ సూచన



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు17(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు చిన్నవాటితో పాటు పెద్దసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే త్వరితగతన పరిష్కరించే అవకాశం ఉంటుందని సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ పరిధిలోని జిల్లాల నుంచి 67 మంది ఫిర్యాదులు చేసినట్లు ఆయన తెలిపారు. కరెంటు సర్వీసులు మంజూరు చేయాలని, కాలిపోయిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలని, విద్యుత్ లైన్ల మార్పు, లోఓల్టేజ్ సమస్య, సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైనవి మినహా మిగిలిన వాటిని పరిష్కరించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, సీజీఎం జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల వితరణతో విద్యా వసతులు

● రూ.58 లక్షలతో సత్యవేడులో కళాశాల హాస్టల్, వానెల్లూరులో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం



సత్యవేడులో హాస్టల్ భవనం ప్రారంభించాక శ్రీసిటీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ ప్రతినిధులు

సత్యవేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్‌వీ పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా రూ.58 లక్షలతో నిర్మించిన నూతన విద్యా వసతులను ఆయా సంస్థల ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. సత్యవేడులో రూ.46 లక్షలు వెచ్చించి 3 విశాల గదులతో నిర్మించిన బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనాన్ని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా, శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి సోమవారం ఉదయం ప్రారంభించారు. సంస్థ డీజీఎం వెంకటేష్, సీఎస్ఆర్ కమిటీ సభ్యులు మల్లీశ్వరన్, పృథ్వీ, మహేష్, ప్రసాద్, శ్రీకాళహస్తి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మునీంద్ర, వార్డెన్లు రామయ్య, గంగాధరం పాల్గొన్నారు.

● శ్రీసిటీలోని చార్ట్-వీఆర్‌వీ పరిశ్రమ రూ.12 లక్షలతో సత్యవేడు మండలం వానెల్లూరులో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, వంట గదులను వీఆర్‌వీ సంస్థ డైరెక్టర్(హెచ్ఆర్) యామిని సిన్హా, తయారీ విభాగం హెడ్ ప్రసంజిత్ ప్రారంభించారు. ఎన్ఎస్ ఇన్‌స్టుమెంట్స్, వీఆర్‌వీ సంస్థల సీఎస్ఆర్ చర్యలను శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్)నిరీషా సన్నారెడ్డిఅభినందించారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

కోర్టులో లొంగిపోయిన మాజీ సీఈవో జగదీశ్

భాకరాపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సహకార సంఘంలో రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన మాజీ సీఈవో జగదీశ్ సోమవారం పీలేరులోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండు విధించిందన్నారు. సహకార సంఘంలో వన్ గ్రాము గోల్డు ఆభరణాలు తాకట్టు పెట్టి 2022 నుంచి 2025 వరకు రూ.72 లక్షల మేరకు సీఈవో ద్వారా కె.రెడ్డమ్మ, సి.రుతున్‌కు రుణాలు మంజూరు చేశారు. ఈ నెల 4న డీసీసీ బ్యాంకు మేనేజరు పరిశీలనలో ఈ విషయాన్ని గుర్తించారు. బాధ్యులైన సీఈవో, అప్రైజరు, అప్పటి పాలకవర్గం, పర్సన్ ఇన్‌ఛార్జ్‌పై చర్యలు తీసుకోవాలన్న సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితమే అధికారులు జగదీశ్‌ను సస్పెండ్ చేశారు. కేసు నమోదు చేశాక పరారీలో ఉన్న జగదీశ్ సోమవారం కోర్టులో లొంగిపోయాడు.

ఫిర్యాదుదారులను తిప్పించుకోవద్దు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 313 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి. పరిష్కారం కానివాటికి ఆయా ఫిర్యాదుదారులకు నివేదిక పంపండి. అంతేకానీ ఫిర్యాదుదారులను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు' అంటూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు పలు సమస్యలపై 313 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపై ఒక రెవెన్యూశాఖకే 199అర్జీలు రావడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

పింఛను ఇప్పించండి



నా అనే వారు నాకెవరూ లేరు. వృద్ధాప్యం కారణంగా నడవలేని పరిస్థితి. కంటిచూపు మందగించింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- అచ్చయ్య, బావాజీ కాలనీ, సూళ్లూరుపేట

మమ్మల్ని ఆదుకోండి



ఓళ్లూరు రాయలచెరువు కట్ట తెగి వరద ప్రవాహానికి ఇళ్లు, పొలాలు దెబ్బతిన్నాయి. మాకు జీవనాధారమైన వ్యవసాయ భూములపై ఇసుక మేట వేసింది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ఆర్థికంగా ఆదుకుని వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా పొలాలను బాగుచేసుకునేందుకు సహకరించండి.

- కళత్తూరు, పాతపాళెం రైతులు, కేవీబీపురం మండలం

మా పొలంలో హెచ్చరిక బోర్డు ఎత్తివేయండి

'మాది కేవీబీపురం మండలం పీవీకండ్రిగ గ్రామం. నా పేరు లోకేష్. మా తాత గురవయ్యకున్న 7.8 ఎకరాల వ్యవసాయ భూమిని మా పెద్దనాన్న, మేము ఉమ్మడిగా సాగు చేసుకునేవాళ్లం. ఐదేళ్ల క్రితం పెద్దమనుషుల సమక్షంలో చెరిసగం పంచుకున్నాం. మాకు వచ్చిన భాగం వ్యవసాయ భూమిలో సాగు చేయనివ్వకుండా మా పెద్దనాన్న వీరాస్వామి, అయన కుమారుడు ప్రేమ్‌కుమార్ దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులను తప్పుదారిపట్టించడంతో మాపొలంలో రెవెన్యూ వారు హెచ్చరిక బోర్డు పెట్టారు. క్షేత్రస్థాయిలో విచారించి మా భూమిలో బోర్డు తొలగించండి. తిరిగి మేము పంటలు సాగు చేసుకోవడానికి సహకరించండి' అంటూ కుటుంబంతో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. కలెక్టర్‌కు అర్జీ అందజేయగా పరిశీలిస్తామన్నారు. ఇదే భూవివాదంపై రెండు వారాల క్రితం వీరిపై వీరాస్వామి కుటుంబం వీరిపై ఆరోపణలు చేస్తూ కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ క్యాన్ తీసుకుని తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యకు చేసుకుంటామని బెదిరించిన సంగతి తెలిసిందే.

12గంటల పనివిధానాన్ని రద్దు చేయండి



మన రాష్ట్రంలో పని గంటలను 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నేత విజయకుమార్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు గంగాదేవి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముగ్గురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన పి.మల్లికార్జున అలియాస్ బాలు, ఉల్లి గుణశేఖర్ స్నేహితులు. జులాయిగా తిరిగేవారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన రోహిణి అలియాస్ శ్రీదేవితో వీరికి పరిచయమైంది. ఈమె సహకారంతో ఈనెల 9న తిరుపతికి చెందిన ఓ బాలికను అపహరించి ఆ ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకుని తల్లితండ్రులకు అప్పగించారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పుత్తూరు వార్తలు

నెల్లిచెట్టుకు పూజలు



పారాయణం చేస్తున్న మహిళలు

వడమాలపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా ఆర్య వైశ్య మహిళలు తులసి, నెల్లిచెట్లకు పూజలు చేశారు. వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో తులసి, నెల్లిచెట్టు ముందు లక్ష్మీదేవి చిత్రపటాన్ని, మహాశివుడి ప్రతి రూపాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నెయ్యి దీపాలు వెలిగించి లక్ష్మీ సహస్ర నామార్చనలు చేశారు. సాయంత్రం నగరేశ్వరునికి అభిషేకం చేసి పూలమాలాలతో అలంకరించారు. రుద్ర గమకాలు పటిస్తూ మహారుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం వానభోజనాలు చేశారు. మండలంలోని పలుదేవాలయాల్లో మహిళలు నెయ్యి దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం



సదాశివేశ్వర ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

పుత్తూరు టౌన్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో వేకువ జామున శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టుపీతాం బరాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద ప్రమిదలతో నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు. తులసి, నెల్లి చెట్లకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఆలయ నిర్వాహకులు స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



పుత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనపాల్‌ను స్థానిక టీడీపీ ముస్లిం మైనార్టీ విభాగ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ నబి, మహమ్మద్ రఫీ, అమీర్‌జాన్, కరీం అలీషా, రంజాన్, పటేల్ పాల్గొన్నారు.

గూళూరు చెరువు నీటిని దిగువకు వదలొద్దు



తహసీల్దార్ కార్యాలయం ముందు రైతుల నిరసన

పుత్తూరు టౌన్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 గ్రామాల రైతులకు సాగు, తాగునీరు అందించే గూళూరు చెరువు నీటిని దిగువకు వదలొద్దని ఆయకట్టు రైతులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వెంకట్రాయులు మాట్లాడుతూ... గూళూరు చెరువులో నీరు పుష్కలంగా ఉండగా, కొందరు ముంపు రైతులు స్వార్థంతో తూములు తీయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు కలిసి కట్టుగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ చెరువులో నీరు సుమారు 600 ఎకరాలు ఆయకట్టు కలిగి, సుమారు 700 మంది రైతులకు సాగునీరు అందిస్తున్నదని తెలిపారు. అలాగే చెరువు నీరు నిల్వ ఉండటంతో చుట్టుపక్కల ఉన్న 20 గ్రామాల బోరు బావుల్లో సైతం నీరు పుష్కలంగా ఉందని చెప్పారు. కిష్టయ్య, భూపతి, సుబ్రమణ్యం, పురుషోత్తం, ఏఎంసి సభ్యులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురండి



మరుగుదొడ్లకు తాళాన్ని చూపుతున్న రమేష్‌బాబు

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు పురపాలకసంఘ కమిషనర్‌ను కోరారు. సోమవారం ఆయన ఆస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, పాదచారులు, వాహన చోదకుల కోసం మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన విక్రమ్ కళాశాల విద్యార్థులు ప్రతిభచూపారు. లాన్ టెన్నిస్‌లో జయసాయి రెండో స్థానం, సాఫ్ట్‌టెన్నిస్‌లో మూడో స్థానం, బాలాజీ జెట్టి సాఫ్ట్‌టెన్నిస్‌లో 5వ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో సోమవారం కళాశాలలో వారిని డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ మునిలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

ముక్కంటి సేవలో ఐ-టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ఐ-టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. శివకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరపతి పార్లమెంట్ ఐ-టీడీపీ అధ్యక్షుడు యాచేంద్ర, నాయకులు బాలాజీరెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అక్రమ మద్యం విక్రేతకు రిమాండ్

నాయుడుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బేరిపేట సెంటర్‌లో కూల్‌డ్రింక్ షాప్ నిర్వహిస్తున్న భాస్కర్ మరో వ్యక్తితో కలిసి తమిళనాడుకు చెందిన 25 క్వార్టర్ల మద్యం బాటిళ్లు, ఏపీకి చెందిన 38 మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వచేసి విక్రస్తుండగా అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని భాస్కర్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా జడ్జి మీనాక్షిసుందరి రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్స్ బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సింహాద్రి తెలిపారు. ఎంఎస్సీ, ఎంసీఏ పూర్తిచేసిన అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.





కుదిరి వద్ద పొలాల్లో నాట్లు వేస్తున్న కూలీలు - ఎన్‌వీకండ్రిగ వద్ద మానుతోలి పొలాన్ని చదును చేస్తున్న రైతు

ముమ్మరంగా రబీ సాగు

జోరుగా సాగుతున్న వరినాట్లు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వరినాట్లు ఊపందుకున్నాయి. సెప్టెంబరులో కురిసిన వర్షాలకు ముందుగా నారు పోసిన రైతులందరూ పొలాలు దున్ని నాట్లు వేస్తున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో నవంబరు ప్రారంభం నుంచే వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 13 వేల హెక్టార్లకు పైగా వరినాట్లు వేయడానికి అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. బావులు, బోర్లలో భూగర్భ జలాలు ఉబికి వచ్చాయి. రైతులంతా పొలాలు దున్ని వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. సూళ్లూరుపేట మండలం కుదిరి, చెరువుకండ్రిగ, మంగళంపాడు, మన్నారుపోలూరు గ్రామాల్లో ఇప్పుడే వరినాట్లు వేస్తున్నారు. కోటపోలూరు, ఎన్‌వీకండ్రిగ, సామంతమల్లాం, మన్నారుపోలూరు, పడమటి కండ్రిగ, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లువేసి ఎరువులు వేస్తున్నారు. అదే విధంగా తడ మండలంలో వేనాడు, ఇరకం, కాదులూరు, మాంబట్టు గ్రామాల్లో ఇప్పటికే వరినాట్లు పూర్తయ్యాయి. పలుచోట్ల వ్యవసాయ పనులు సాగుతున్నాయి. దొరివారిసత్రంలో పలు గ్రామాల్లో ఎల్లిపైర్లు వేయగా కొన్ని గ్రామాల్లో ఇప్పుడే నాట్లు వేస్తున్నారు. మరో వారం రోజుల్లో వరినాట్లు మరింత ఊపందుకుంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పారిశ్రామికాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ అహర్నిషలు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో దేశ, విదేశాలనుంచి అనేక పరిశ్రమలను మన రాష్ట్రానికి సీఎం తీసుకువస్తున్నారన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో అనేక పరిశ్రమలు రాష్ట్రంలో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడం సీఎం చంద్రబాబు సమర్థతపై వారికున్న నమ్మకమే కారణమన్నారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 16 లక్షల మందికి పైగా ఉద్యోవకాశాలు లభిస్తాయన్నారు. గూగుల్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీ విశాఖకు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, ఇశ్రాయేల్‌కుమార్, వేముల సునీల్, జనార్దనరెడ్డి, పిళ్లెల శ్రీనివాసులు, పార్వతయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పాశిం



ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ప్రతి నెలా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని దీపక్‌రెడ్డి సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ సూచించినట్లు చెప్పారు.

పోలేరమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో సోమవారం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని హరిజనకాలనీలో పోలేరమ్మ ఆలయం ఏర్పాటు చేసి ఏడాది కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.కార్యక్రమంలో చేవూరు విజయ మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య, కల్లూరు రవి, సుబ్బారావు పాల్గొన్నారు.

కార్తీక సోమవార పూజలు



శివాలయంలో కార్తీకదీపాలను వెలగిస్తున్న భక్తులు

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని పలు శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమసుందేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలగించారు.

గూడలిలో...



గూడలిలో ఊరేగుతున్న సంగమేశ్వరుడు, కామాక్షీదేవి

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గూడలిలోని పురాతన సంగమేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక పూజలు జరిగాయి. సంగమేశ్వరుడికి వేదపండితులు అభిషేకాలు చేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఉభయకర్తలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సంగమేశ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

వీవోఏ ఎంపికపై ఫిర్యాదు

ఓజిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ సంఘ బంధం-2లో సభ్యుల తీర్మానం లేకుండా వీవోఏను ఎంపిక చేయడంపై ఆ సంఘ సభ్యులు సోమవారం ఎంపీడీవో నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఏపీఎం పద్మతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎంపీడీవో చెప్పారు.

టైనీటాట్స్ స్కూల్‌కు గ్లోబల్ క్లాస్ అవార్డు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టైనీటాట్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు గ్లోబల్ క్లాస్ అవార్డు దక్కింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఫ్యూచర్ ఆఫ్ దుబాయ్ సదస్సులో టైనీటాట్స్ కరస్పాండెంట్ ధనుంజయరెడ్డి అవార్డు అందుకున్నారు.

ఆర్థిక సాయం

నాయుడుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం లోతువానిగుంటలో సిలిండర్ పేలి పూరిల్లు కాలిపోయిన విషయం తెలిసిందే. బాధితురాలు సుబ్బమ్మకు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రఫీ రూ.10వేలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయ, లక్ష్మయ్య, గిరి, నరసమ్మ, కోకిల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

వాకాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం గ్రామానికి చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి తల్లి కృష్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి దుగరాజపట్నం చేరుకొని కృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి



తాళ్వాయిపాడు ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో శంకరయ్య

పెళ్లకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు ఎంఈవో మించల శంకరయ్య అన్నారు. సోమవారం మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను ఎంఈవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అపార్, ఆధార్ అప్డేట్ సకాలంలో పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. 2026 మార్చి 16నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని, ఈ నేపథ్యంలో డిసెంబరు 6వ తేదీ నుంచి వంద రోజుల ప్రత్యేక తరగతులను ప్రారంభించనున్నట్లు ఎంఈవో చెప్పారు.

పాఠశాలలో తనిఖీలు



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తానయ్య

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మస్తానయ్య సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

రంగన్నగుంటలో అంబళం పూజ

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ రంగన్నగుంటలో సోమవారం రాత్రి అయ్యప్ప అంబళం పడిపూజ జరిగింది. రంగన్నగుంట, వెంకన్నపాళెం, తిన్నెలపూడి గ్రామాలకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు పూజ నిర్వహించారు. స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు.



అంబళం పూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజకు కొలువుదీర్చిన అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తి విగ్రహం

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. సోమవారం తమిళ కార్తీక మాసం ప్రారంభం కావడంతో పాటు శబరిమలైలో అయ్యప్ప ఆలయాన్ని తెరిచి భక్తుల దర్శనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాపూజీవీధిలో అయ్యప్పస్వామి భక్తులు పడిపూజ, జ్యోతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ చేశారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తి విగ్రహాన్ని పార్కువీధిలోని మద్వేంకటరామ్మూర్తి స్వామి ఆలయం వద్ద నుంచి పడిపూజ నిర్వాహకులు, చిన్ని జువెలరీ అధినేత శ్రీనివాసులు చేతుల మీదుగా ఊరేగింపుగా పడిపూజ ప్రాంగణానికి తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీర్చిన అయ్యప్పస్వామి, సుబ్రమణ్య స్వామి, వినాయకుడి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, జ్యోతి ప్రజ్వలన చేసి పడిపూజ ప్రారంభించారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ దంపతులు, అజంత హోటల్ అధినేత బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో అందిన అర్జీలను పరిశీలించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా వీఆర్వోలు చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నరాణి, వ్యవసాయశాఖ ఏవో శిరీషా తదితరులు పాల్గొన్నారు.

1250 పక్కా గృహాల మంజూరు

డక్కిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలో 1250మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయని ఎంపీడీవో రవీంద్రబాబు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి మొదటి విడతలో 1250 పక్కా గృహాలు మంజూరయ్యాయని, ఈనెల 30వ తేదీలోగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణాలు చేపట్టే స్థలాలను గుర్తించి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా ఇళ్లు కావాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

విజ్ఞానానికి తొలిమెట్టు గ్రంథాలయాలు



సెమినార్‌లో మాట్లాడుతున్న లైబ్రేరియన్ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానానికి తొలిమెట్టని లైబ్రేరియన్ శ్రీనివాసులు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ జ్ఞానాన్ని, సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నన్నయ్య, తిక్కన, ఎర్రన, శ్రీశ్రీ వంటి ప్రముఖ కవుల గురించి వివరించారు. గ్రంథాలయాకు వెళ్లి పుస్తకాలు చదవితే జ్ఞానంతో పాటు మంచి అలవాట్లు అలవడుతాయన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి విష్ణువర్మ

వెంకటగిరి టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి సివిల్ కోర్టు జడ్జి విష్ణువర్మ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, వృద్ధుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు

● ఎమ్మెల్యే ఆదిమూలం హెచ్చరిక



ప్రొటోకాల్ జీవోను చూపుతున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో తన పర్యటనలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన జీవోను జారీ చేశారని తెలిపారు. జీవో కాపీని ప్రదర్శించారు. ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని వారికి అధికారులు ప్రొటోకాల్ కల్పించడంపై ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం నియోజకవర్గంలో అట్రాసిటీ కేసులు, హత్య నేరాల కేసులు ఉండకూడదని ఆకాక్షించాని అయితే పోలీసులు కాంపాళెం దళితుల విషయంలో హత్యా నేరం కేసు నమోదు చేసి జైలులో వేశారని తెలిపారు. రెండు వర్గాలకు సంబంధించిన కేసులు నమోదు చేస్తే దళితులను మాత్రం అరెస్టు చేయడమే కాకుండా వారిపై దాడులు చేసిన వారిని ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై డీజీపీ, జిల్లా ఎస్పీ, జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వైభవంగా త్రయోదశి పూజలు



నాగలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలో నందీశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు కార్తీకేశన్ గురుకుల్ పంచామృతాలతో అభిషేకాలు చేసి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడిని పుష్పాలతో అలంకరించి చేసి మహా, కుంభ, నక్షత్ర హారతులు చేపట్టారు. ప్రదోష పూజల అనంతరం ఉత్సవమూర్తులైన మరకదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామివార్లకు ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ పద్మనాభరాజు, సభ్యులు హంస రుద్రయ్య, కృష్ణయ్య యాదవ్, శ్రీనివాసులు నాయుడు, నాగభూషణమ్మ, నెల్సన్‌మండేలా, జయంతి, దేవి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో సర్వమంగళా దేవి సమేత వాల్మీకేశ్వర స్వామివార్లకు బిల్వార్చన నిర్వహించారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు జరిపి గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఆర్థికసాయం చేయండి

●కలెక్టర్‌కు రాయలచెరువు ముంపు రైతుల వినతి



కలెక్టరేట్ వద్ద పాతపాళెం రైతులు

కేవీబీపురం, నవంబు 17(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట తెగి ముంపునకు గురైన తమను ఆర్థికంగా ఆదుకోవాలని పాతపాళెం, కళత్తూరు అరుంధతివాడ సన్న, చిన్నకారు రైతులు పీజీఆర్ఎస్‌లో వినతి చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దెబ్బతిన్న పొలాల ఫొటోలను, రాయలచెరువు పరిస్థితి చిత్రాలను కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. పొలాలపై ఇసుక మేట వేసిన కారణంగా రబీ సీజన్ ప్రారంభమైనా సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. తమ పొలాలను పరిశీలించి వాటికి పరిష్కారం చూపితే పంటలు వేసుకుంటామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ప్రభుత్వం ద్వారా పనులు ప్రారంభించి సాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. శివప్రసాద్ వర్మ, దొరవేలు, చంద్ర, జయరాము, డిల్లీ, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే కళత్తూరు, పాతపాళెం, అరుంధతివాడల్లోని బాధితులకు కాట్రపల్లివాసులు తమ వంతు సాయంగా ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన సిద్ధిరాజు కండ్రిగ జడ్పీ హైస్కూలు విద్యార్థులు

పిచ్చాటూరు/ వరదయ్యపాళెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూలు గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్-14, 17 పోటీలకు స్థానిక సిద్ధిరాజు కండ్రిగ జడ్పీ హైస్కూలు నుంచి పది మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ దశరథ తెలిపారు. చిత్తూరు పీవీకేఎన్ క్రీడా మైదానంలో ఈనెల 16వ తేదీ ఆదివారం జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-17 బాలికల విభాగంలో హర్షిత, ప్రియాంక(స్టాండ్ బై) కాగా బాలుర విభాగంలో చరణ్, గౌతమ్, వరుణ్‌సందేశ్(స్టాండ్ బై) ఎన్నికయ్యారు. వీరు ఈనెల 20, 21, 22 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే అండర్-14 బాలికల విభాగంలో నిషా, భవ్య, భారతి(స్టాండ్‌బై) బాలుర విభాగంలో చెర్రీ, రాహుల్ ఎంపికయ్యారు. వీరు కడప జిల్లా పులివెందులలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

కరాటే పోటీలకు మోక్షిత... 69వ జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలురు, బాలికల జిల్లా కరాటే పోటీలను ఆదివారం తిరుపతిలోని బైరాగిపట్టెడలో నిర్వహించారు. ఇందులో వరదయ్యపాళెం మండలం పాండూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మోక్షిత అండర్-19 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సోమవారం ప్రధానోపాధ్యాయుడు ముని సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు మోక్షితను అభినందించి రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని ఆకాక్షించారు.

నిత్యావసరాల పంపిణీ



రేణిగుంట నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏకం యూ యాజ్ ఏ ఆర్థిక సహకారంతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని పద్మానగర్‌లో తుఫాన్ కారణంగా నష్టపోయిన 60 కుటుంబాలకు టీడీపీ నాయకుడు రాజశేఖర్ రెడ్డి చేతులు మీదుగా 22 రకాల నిత్యవసర సరుకుల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, సిరడ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి హేమశేఖర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌డీసీ నర్సరీలో కార్తీక వన భోజనాలు



సత్యవేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యవేడు అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలను నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం స్థానిక అటవీ అభివృద్ధి సంస్థ వనరాజ విఘ్నేశ్వర విశాలాక్ష సమేత విశ్వనాథస్వామి ఆలయ ప్రాంగణంలో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాలాక్ష సమేత విశ్వనాథ స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరి చెట్టు కింద లక్ష్మీపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులతో కలసి ఏపీఎఫ్‌డీసీ అధికారులు ఉసిరి చెట్టు కింద వన భోజనాలు చేశారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

కేవీబీపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల దెబ్బతిన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాజీ ఎంఈవో వంశీకృష్ణ, తన కుమారుడు శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన చైతన్య ఆస్పత్రి వైద్యుడు చైతన్య ఆర్థిక సాయంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, విద్యాసామగ్రిని అందజేశారు. మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో కొనసాగిన భక్తుల రద్దీ





దర్శనానికి బారులు తీరిన భక్తులు - బిల్వార్చన చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం చివరి కార్తీక సోమవారం పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయ పూర్వమే ఆలయం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్వర్ణముఖి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భిక్షాల గాలిగోపురం సమీపంలో భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా విశేషంగా దీపారాధన సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. సుమారు 37వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,740 మంది, రూ.200 శీఘ్ర ప్రవేశదర్శనం టిక్కెట్ల ద్వారా 5,520మంది, రూ.500అంతరాలయ దర్శన టిక్కెట్లు కలిపి మొత్తం 9,265 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఐదు రకాల రాహుకేతుపూజలు కలిపి మొత్తం 4,375 జరిగాయి.

శాస్త్రోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చనలను నిర్వహించారు. కార్తీక మాసం విశేషాన్ని ఆలయ అలంకార మండపంలో రుత్వికులు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చనలను సాగించారు. అనంతరం తిరిగి సాయంత్రం నాల్గో కాలం అర్చన చేశారు. అభిషేక గురుకుల్, రాజేష్ గురుకుల్, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజధానిలో అలరిస్తున్న ఆంధ్రప్రదేశ్ హస్తకళలు





ప్రగతి మైదాన్‌లో కొయ్యబొమ్మల ప్రదర్శన - మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దశరథాచారి

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఏర్పాటు చేసిన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ హస్తకళలు అలరిస్తున్నాయి. వీటిని ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి ఆధ్వర్యంలో తయారుచేసిన కొయ్యబొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే విధంగా శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ వస్త్రాలు సందర్శకులను ఆకర్షించాయి. మంత్రి ఈ స్టాళ్లను సందర్శించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో చేతివృత్తులు, చేనేత, హస్తకళల అభివృద్ధికి సహకరించాలని మంత్రిని దశరథాచారి కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

గుడిమల్లానికి పోటెత్తిన భక్తులు

మహాంకాళేశ్వరుడి అలంకారంలో పరశురామేశ్వరస్వామి



నేతి దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఏర్పేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని మహాకాళేశ్వరుడి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు.

వృద్ధులకు చట్టాలపై అవగాహన



వృద్ధుడిని పరామర్శిస్తున్న జడ్జి కృష్ణప్రియ

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరద్వాజతీర్థంలో ఉన్న కంచికామకోటి వృద్ధాశ్రమంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. అందులో భాగంగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పింఛన్లు, ఉచిత న్యాయంపై అర్జీ ఇస్తే పరిష్కరిస్తామన్నారు. న్యాయసలహాల కోసం నెం.15100లో సంప్రదించాలన్నారు. న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు



శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని తంగేళ్లపాళెం పీఏసీఎస్‌లో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. అధ్యక్షుడు భీమాల భాస్కర్ సహకార జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ... కొత్త జాతీయ సహకార విధానం దేశ సహకార సంస్థల బలోపేతం, కంప్యూటరీకరణ, నూతన ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాధికారత లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్, మురళీమోహన్‌కృష్ణ, సీఈవో చిరంజీవిరెడ్డి, సంఘ డైరెక్టర్ బుచ్చయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

సత్యవేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండలంలోని పేరడం గిరిజనులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకుడు రమేష్ మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రెవెన్యూ, విద్యుత్ అధికారులు ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు.

నేడు టీడీపీ సర్వసభ్య సమావేశం

పిచ్చాటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీబీడీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని సత్యవేడు నియోజకవర్గ పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన అన్ని విభాగాల గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ రాష్ట్ర స్థాయి నాయకులందరూ హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, అబ్బుర్వర్లు సురేష్ రాజు, రమణారెడ్డి, వెంకటేశ్వరులు హాజరవుతున్నారని తెలిపారు.

ఈక్రాప్ నమోదుపై అవగాహన

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీఎంవీకండ్రిగ రైతు సేవ కేంద్రంలో సోమవారం రైతులకు ఈక్రాప్ నమోదుపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్‌నాయక్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు, గిట్టుబాటు ధర, ధాన్యం కొనుగోలు సమయంలో ఈ క్రాప్ నమోదు ఉపయోగపడుతుందన్నారు. టీఎంకండ్రిగ, చుక్కలనిడిగల్లు, పెనుబాక, అరవకొత్తూరు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ దొరైరాజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, కృష్ణమనాయుడు, మునిశంకర్‌రెడ్డి, లీలయ్య, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి సోమవారం విజయవాకడు చెందిన దొన్నేపూడి నాగేంద్రబాబు దంపతులు రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పారదర్శకంగా లావాదేవీలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో లావాదేవీలు పారదర్శంగా ఉండాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ చెప్పారు. బీఎన్‌కండ్రిగ వెలుగు కార్యాలయంలో వీఓఏలు, సీసీలతో సోమవారం జరిగిన సమావేశంలో ఏపీఎం మునెయ్య మట్లాడుతూ.. ఇక నుంచి మహిళా సంఘాల లావాదేవీలు వారి ఫోన్‌లో సరిచేసుకోవాలన్నారు. ఇప్పటికే ఐదు సంఘాల్లో పైలెట్‌గా 'మన డబ్బులు మన లెక్కలు' కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎంపికైన సంఘాలకు ఈనెల 18 నుంచి 21 వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. సమాఖ్య లీడర్లు భారతి, లావణ్య, సీసీలు వెంకటరత్నం, వీరజిన్న తదితరులు పాల్గొన్నారు.

24న బార్ అసోసియేషన్ ఎన్నికలు

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 24న బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు న్యాయవాదులు తెలిపారు. ఎన్నికల అధికారులుగా అంజూరు గిరిబాబు, పసుపులేటి పార్థసారథి, పూల భాస్కర్ వ్యవహరించనున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైరందని, 18న స్క్రూటినీ, 19న విత్‌డ్రా, 24న ఉదయం 10గంటలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అదే రోజు సాయంత్రం 4గంటలకు కౌంటింగ్ నిర్వహించి, 25న బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు మునిప్రసాద్, శశికుమార్, రాజేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీవిద్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మండలంలోని వెస్ట్‌వరత్తూరులో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథక నిధులు రూ.14.40లక్షలతో నిర్మించనున్న మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకముందు సచివాలయాన్ని తనిఖీ చేయగా సిబ్బంది లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ దయ, ఎంపీటీసీ సభ్యుడు రవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎస్ఐ హరిప్రసాద్, ఆర్ బ్ల్యూఎస్ ఏఈ విద్యాకుమారి, ఏపీఎం మునెయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు, కవి, రచయిత డాక్టర్ వీఆర్‌రాసాని అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. పుస్తకం తండ్రిగా, గురువుగా ఉపదేశం చేస్తుందన్నారు. పౌరుడు ఎదగాలంటే పుస్తకాలు చదవాలన్నారు. కవులు తీగల వెంకటయ్య, మునిసుబ్బారెడ్డి, గురునాథం, షణ్ముఖం, శ్రీనివాసులు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఉమాదేవి, గ్రేడ్ వన్ గ్రంథాలయ అధికారి శివప్రసాద్, గ్రంథాలయ అధికారులు లావణ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయంలో యూరియా పంపిణీ



ఏర్పేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిపేడు రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు అధికారులు యూరియా పంపిణీ చేశారు. ప్రతి సచివాలయంలో రైతులకు యూరియా అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మాజీ సర్పంచులు మనోహర్‌నాయుడు, అంకయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం





వెంకటముని - మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం గూడూరులో జరిగింది. ఇందులో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంరాజు, అధ్యక్షుడిగా వెంకటముని, ఉపాధ్యక్షుడిగా వెంకటాద్రి, మల్లికార్జున్, నారాయణ, భువనేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణను ఎన్నుకున్నారు.

వ్యాసరచన పోటీలు

నాగలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు గ్రంథాలయ అధికారి ప్రసాద్, ఉపాధ్యాయులు బహుమతలు పంపిణీ చేశారు.